జీలుగ విత్తనాల కొరత

- ఇప్పటికే 30 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ
- గతేడాది 75 క్వింటాళ్ల జీలుగ విత్తనాల వాడకం
- వాతావరణ మార్పులతో పెరుగుతున్న డిమాండ్


రాజోళి మండలంలో సాగు చేసిన జీలుగ పంట

రాజోళి: మండలంలో సబ్సిడీ జీలుగ విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, భూమి స్వభావం కారణంగా పంటల దిగుబడి కోసం వాడే ఈ జీలుగకు రైతులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఈ క్రమంలో రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీపై విత్తనాలు అందినప్పటికీ పూర్తి స్థాయిలో అవసరమున్న రైతులకు ఇంకా అందకపోవడంతో రైతులు వాటా కోసం ఎదురు చూస్తున్నారు. మరో వారం పదిరోజుల్లో సాగు మొదలయ్యే అవకాశాలు ఉండటంతో వీలైనంత త్వరగా జీలుగ విత్తనాలు ప్రభుత్వం అందించాలని డిమాండ్ పెరుగుతోంది.

30 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ..

వారంలో ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించే క్రమంలో మండలానికి మొదటి విడతలో 30 క్వింటాళ్ల విత్తనాలు అందించింది. కాగా అతి తక్కువ సమయంలోనే విత్తనాలు అయిపో యాయంటే రైతుల నుంచి ఎంత డిమాండ్ ఉందో తెలుస్తోంది. గతేడాది 75 క్వింటాళ్ల జీలుగ రాగా, 162 మంది రైతులు వాటిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది 30 కేజీ ప్యాకెట్ ధర రూ.1,116 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు సబ్సిడీ ధర ప్రకారమే విత్తనాలు కొంటున్నారు. కానీ అవసరాలకు సరిపడా విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జీలుగకు ప్రాధాన్యత..

ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన స్వభావం కలిగిన భూములుంటాయి. ఈ క్రమంలో సౌడు, ఇతర స్వభావం కలిగిన భూముల్లో ఎక్కువగా జీలుగను(పచ్చి రొట్ట ఎరువుగా) దీన్ని వాడతారు. ఇప్పుడు విత్తనాలు చల్లుకుని అది పెరిగాక నేరుగా భూమిలోనే దాన్ని కలిపేస్తారు. అనంతరం పంటలు సాగు చేస్తారు. దీని వల్ల భూమి స్వభావంలో మార్పులు వచ్చి పంటల దిగుబడి పెరుగుతుంది. ఈ కారణం చేత రైతులు ఎక్కువగా ఈ జీలుగ విత్తనాలు వాడుతుంటారు. ఇంతవరకు రైతులకు సరిపడా విత్తనాలు రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలియదని, బోర్లు, బావులు ఇతర నీటి వనరులున్న వారు ఇప్పటికే విత్తనాలు తీసుకున్నారని, నీటి వసతి లేని వారు వర్షాలు, కెనాల్‌పై ఆధారపడిన వారికి కూడా విత్తనాలు అందితే నీరు రాగానే విత్తనాలు వేసే అవకాశముంటుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం జీలుగకు రైతుల నుంచి ఎంతో డిమాండ్ ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అందరికీ సరిపడేలా విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు అంటున్నారు. మండలానికి 250 క్వింటాళ్లు అవసరముందని ఇండెంట్ పెట్టగా, ఇప్పటికి 30 క్వింటాళ్లు వచ్చిందని, మరో 70 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎక్కువ మొత్తంలో వస్తే రైతులందరికి జీలుగ అందుతుందని పేర్కొంటున్నారు.

అందరికీ అందించాలి..



జీలుగ అనేది ప్రతి రైతు తప్పకుండా వాడేందుకు ఇష్టపడతాడు. భూమి స్వభావంలో మార్పులు వచ్చే ఈ జీలుగతో పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు 30 క్వింటాళ్లు రైతు ఆగ్రోస్ సేవా కేంద్రం ద్వారా అందించారు. కానీ అవి రైతులకు పూర్తి స్థాయిలో అందలేదు.

– బునగప్ప, చిన్నధన్వాడ, రైతు

సాగు పెరిగింది..



మండంలలో జీలుగ విత్తనా లు గతేడాది నుంచి రైతులు ఎక్కువగా వాడుతున్నారు. సౌడు భూములు, ఉప్పు పొంగే భూములున్నాయి. నది ప రివాహక గ్రామాల్లో వరి పంటలు సాగు చేస్తా రు. వీటి సాగు కోసం జీలుగ వాడతారు. ప్రభు త్వం వీలైనంత త్వరగా విత్తనాలు అందించాలి.

– వినోద్ కుమార్‌రెడ్డి, రైతు చిన్న ధన్వాడ

మరో 70 క్వింటాళ్లు వస్తాయి

మండలంలో రైతుల అవసరాల కోసం 250 క్వింటాళ్ల జీలుగ ఇండెంట్ పెట్టాం. వారంలో 30 క్వింటాళ్లు రాగా రైతులకు అందించాం. మరో 70 క్వింటాళ్ల వరకు వస్తాయి. రైతుల అవసరాలను బట్టి పై అధికారులకు ఈ విషయాన్ని తెలియచేసి, పూర్తి స్థాయిలో జీలుగను అందించేందుకు ప్రయత్నిస్తాం.

– చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి, రాజోళి

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


జూలెకల్ అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

శాంతినగర్: హనుమాన్ జయంతి వేడుకలను వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని జూలెకల్ అభయాంజనేయస్వామి వారి ఆలయంలో ప్రాతఃకాలం నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుల పూజ, సిందూరంతో లేపనాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు జరిపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రామాపురం ఉభయ లింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన అంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో అర్చకులు అడవిస్వామి భక్తులతో విశేష పూజలు చేశారు. శాంతినగర్‌లో వెలసిన పల్లె ఆంజనేయస్వామి వారి ఆలయంలో అభిషేకం, అర్చన, ఆకుల పూజ, భజన కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.


అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. రామనామం, జై హన్‌మాన్, జై భజరంగభళి నామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రాగటూరు గ్రామస్తులు బూడిదపాడు ఆంజనేయ స్వామి నుంచి బైక్ ర్యాలీతో వెళ్లి ప్రాగటూరు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


వడ్డేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అమరవాయిలో పాల్గొన్న భక్తులు


భజన చేస్తున్న భక్తులు

మామిడాకుతో ఆంజనేయస్వామి చిత్రం

ఎర్రవల్లిచౌరస్తా: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన పార్థు సాగర్ మామిడాకుతో ఆంజనేయస్వామి చిత్రాన్ని తయారు చేశారు. యువకుడి భక్తితో పాటు ఆలోచన నైపుణ్యాన్ని చూసిన పలువురు అభినందించారు.



ముగిసిన నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి పాల ఉట్లను కిందకు దింపి స్వామివారి ఆలయంలో భద్రపర్చారు. అంతకుముందు స్వామివారి పవ, రథోత్సవాన్ని ఆలయంలోకి తీసుకెళ్లారు. పూజల్లో గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య మాట్లాడుతూ.. నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 18వ తేదీన ప్రారంభమైందన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా నూతన ఆలయ కమిటీ ఎన్నుకోవాల్సి ఉన్న కొన్ని అనివార్య కారణాలతో అదే కమిటీని కొనసాగించారు.


పాల ఉట్ల కంభం దింపుతున్న భక్తులు

అవతరణ దినోత్సవంలో భాగస్వాములవ్వండి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అవతరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ ఉత్సవాల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు.

నల్లమట్టి తరలింపు ఆపాలి

గట్టు: మాచర్ల చెరువు నుంచి నల్లమట్టి తరలింపును ఆపాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం మాచర్ల చెరువులోని నల్లమట్టిని తరలిస్తున్న దగ్గర వెళ్లి వాహనాలను అడ్డుకున్నారు. మాచర్ల చెరువులో 10 ఫీట్ల మేరకు నల్లమట్టిని తరలించడం ద్వారా చెరువు కింది భాగంలో ఉన్న ఇండ్లలోకి ఊటనీరు వచ్చే ప్రమాదం ఉందని మాచర్ల ప్రకాష్ తెలిపారు. ఇష్టానుసారంగా రాత్రి, పగలు నల్లమట్టిని తరలించడం ద్వారా రాబోయో రోజుల్లో గ్రామానికి ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలిపారు. నల్లమట్టిని తరలిస్తున్న వారిపై చట్ట పరంగా చర్య లు తీసుకోవాలన్నారు. చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని, నీటి పారుదల శాఖ, మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించి నల్లమట్టిని తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యోగా శిబిరం విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ని పురస్కరించుకుని పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా సమితి అధ్యక్షుడు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 21 శుక్రవారం వరకు ప్రతీరోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రణాయామంతో పాటు ఆహార అలవాట్లపై వివరిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గృహ హింస: కేసు నమోదు

అమరచింత: భర్తతో పాటు అత్త నిత్యం వేధిస్తున్నా రని వివాహిత మహిళ ధరణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహహింస కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ధరణికి మూడేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన రవికుమార్‌తో ప్రేమ పెళ్లి జరిగింది. ప్రస్తుతం తను అందంగా లేనని, ఇంటికి వస్తే తన అమ్మ, అన్న బయటకు నెట్టేస్తారని భర్త చెప్పడంతో మనస్తాపంతో పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ధరణి ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపై గృహహింస కేసు నమోదు చేశామన్నారు.

దశాబ్ది ఉత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే


క్యాండిల్‌ర్యాలీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు సాగిన క్యాండిల్ ర్యాలీలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళి అర్పించారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

- డీఆర్‌డీఓ నర్సింగరావు

అలంపూర రూరల్: 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టించేందుకు మహిళా సంఘం టైలర్లకు ఇవ్వడంతో శనివారం డీఆర్‌డీఓ నర్సింగరావు, ఏపీఎం ప్రవీణలు మూడు సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు ఇచ్చిన పనులను వేగంగా పూర్తి చేయాలని, ఇక నుంచి అంగన్‌వాడీ పిల్లలకు మీ ద్వారానే యూనిఫామ్స్ కుట్టించి ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాజు, మండల అకౌంటెంట్ సుధాకర్ నాయుడు, సీసీలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రాల పరిశీలన

మానవపాడు: మండలలంలోని మహిళా కుట్టు మిషన్ సెంటర్లను శనివారం జిల్లా డీఆర్‌డీఓ బి నర్సింగ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లోని కుట్టు మిషన్ల ద్వారా విద్యార్థులకు యూనిఫామ్స్‌ను కుట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం బీమన్న, వెంకటేష్, సీసీ నాగేశ్వర్ రావు, సీసీ బాషా, తదితరులు పాల్గొన్నారు.


యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శనివారం రైతులకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని కోరుతూ ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్‌కు బీఎస్పీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. వ్యవసాయం కోసం ఎలాంటి ముందస్తు ప్రణాళికలు చేయకుండా తూతూ మంత్రంగా విత్తనాలను పంపిణీ చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. గత వారంలో ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం వెళ్లిన రైతులపై ప్రభుత్వం లాఠీచార్జి చేయించిందన్నారు. బ్లాక్ మార్కెట్‌లోకి విత్తనాలు తరలి వెళ్లకుండా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, బీసన్న, తదితరులు ఉన్నారు.


ఇటిక్యాలలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

విద్యార్థులను ప్రోత్సహించేందుకే సన్మానం


శాంతినగర్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

శాంతినగర్: నాయీబ్రాహ్మణ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకే సన్మానం చేస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బ్యాండ్ ఆంజనేయులు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విద్యాదీవెన పథకం కింద ఏడు మండలాల్లో గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు షీల్డు, శాలువా, పూలమాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణసంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

అమరచింత: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణ మాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాజన్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాలంటే ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. 2024 సంవత్సరంలోనే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సన్నాలకు కాకుండా వరి పండించిన రైతులందరికీ రూ.500 వందల బోనస్ ఇవ్వాలన్నారు. ఫర్టిలైజర్స్ షాప్‌లలో ఈపాస్ యంత్రాల ద్వారానే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలను అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ వెంకటేష్‌కు అందించారు. కార్యక్రమంలో వెంకటయ్య, చింతలన్న, బాలస్వామి, కురుమన్న, మహమూద్, భక్తరాజ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

కొత్తకోట రూరల్: ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్థానిక పోలీసులతో కలిసి ఏఓ మున్నా పట్టణంలోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేయడంతో పాటు స్టాక్ నిల్వ వివరాలు, రికార్డు నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపుల్లోనే కొనుగోలు చేయాలన్నారు. ఏ డీలరైనా విత్తనాలను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే, కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడిబాటను విజయవంతం చేద్దాం

అమరచింత: ఈనెల 3 నుంచి 19 వరకు కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. బడిబాట కార్యక్రమ నిర్వహణపై శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బడిబాట కార్యక్రమానికి సంబంధించి రోజువారి చేయాల్సిన కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు వివరించారు. బడిబయటి పిల్లలను గుర్తించడమే కాకుండా ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉంటుందన్న విషయాలను విద్యార్థుల తల్లితండ్రులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు బలరాముడు, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


అమరచింతలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు కోసం నిర్వహించే బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీల చైర్‌పర్సన్లకు మండల స్థాయి బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీటీ అశోక్‌నాయుడు, ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాల భూములు కాపాడేదెవరు?

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్, కొంకల గ్రామాలకు చెందిన ఆలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని, భూములను కాపాడేదెవరని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన ఆంజనేయస్వామి, ఈశ్వరస్వామి, లింగమయ్యస్వామి, నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయాలకు సంబంధించి సుమారు 80 ఎకరాల భూములున్నాయి. ఆయా దేవుళ్లకు చెందిన భూములను దేవుళ్ల పేర్ల నుంచి మార్పు చేసుకొని సొంత పేర్లమీద పట్టాలు చేయించుకుంటున్నారని, కొందరు పట్టా మార్చుకుని అమ్ముకుంటున్నారని వాపోతున్నారు. ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం కేటాయించిన భూములను సొంత పేర్లమీద పట్టాలు మార్చుకుని అమ్ముకుంటే భవిష్యత్‌లో ఆలయాల్లో ధూప, దీపాలు వెలిగించే నాథుడు కరువయ్యే అవకాశం ఉందని, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుని వివరాలు తెలిస్తే సంప్రదించండి

అయిజ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పాతబస్టాండ్‌లో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడికి సంబంధించిన వారు వస్తారేమోనని మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే అయిజ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎస్ఐ



అలంపూర్ రూరల్: లింగన్‌వాయి గ్రామానికి చెందిన హెడ్ కానిస్టెబుల్ చెన్నకేశవులు (52) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కోదండాపురం ఎస్ఐ స్వాతి మృతుడి స్వగృహం చేరుకుని వారి కుటుంబాన్ని పరామర్శించి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.20 లక్షలు భార్య జయమ్మకు అందించారు. ఆమె వెంట సిబ్బంది మస్తాన్, తిరుపతయ్య ఉన్నారు.

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు



శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లి గ్రామంలో శాంతినగర్ పశువైద్యశాల ఆధ్వర్యంలో గొర్రెలకు శనివారం టీకాలు వేశారు. వానాకాలంలో సంక్రమించే చిటుక రోగానికి సంబంధించి ముందస్తు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యులు తెలిపారు. ఆయా గ్రామాల్లోని జీవాల పోషకులు తప్పనిసరిగా వారి గొర్రెలు, మేకలకు చిటుక రోగ నిరోధక టీకాలు వేయించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



మానవపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు ఆధునీకీకరణ పనులను నాణ్యతగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నారాయణపురం గ్రా మంలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా తీర్చి దిద్దడానికి గ్రామంలోని నాయకులు భాస్కర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, బోయలింగేశ్వర్, గొల్ల వెంకట్రాముడు, రాజనందం ఆధ్వర్యంలో పాఠశాలలను రూ.3.35లక్షల నిధులతో పాఠశాలలను అభివృద్ధిని (మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు) కల్పిస్తున్నామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు..

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయ హుండీని శనివారం ఈఓ రామేశ్వర శర్మ, జూనియర్ అసిస్టెంట్ నగేష్, గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. 2021 సంవత్సరం నుంచి శనివారం వరకు రూ.25,800 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. లెక్కింపులో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, గ్రామస్తులు కొంకి రమేష్, ధన్వాడ నాగరాజు పాల్గొన్నారు.